క్లుప్తంగా

బాచుపల్లి సీఐగా సుమన్



నిజాంపేట్: బాచుపల్లి సీఐగా సుమన్ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ నరసింహారెడ్డి సైబరాబాద్ సీఐ సెల్‌కు బదిలీ కాగా, ఆయన స్థానంలో మియాపూర్ ట్రాఫిక్ సీఐగా పని చేస్తున్న సుమన్‌ను లా అండ్ ఆర్డర్ సీఐగా నియమిస్తూ సైబరాబాద్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

పరామర్శ



జెమ్మి దేవేందర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి

కుత్బుల్లాపూర్: కొంపల్లికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నేత, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ జెమ్మి దేవేందర్‌ను శుక్రవారం మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందిన దేవేందర్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. దూలపల్లి సింగిల్ విండో చైర్మన్ గరిసె నరేందర్‌రాజు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ఫేర్‌వెల్ పార్టీ

నిజాంపేట్: బాచుపల్లిలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం టెన్త్ విద్యార్థులకు ఫేర్‌వెల్ పార్టీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ కాసాని సుధాకర్ ముదిరాజ్ హాజరై టెన్త్ విద్యార్థులకు హాల్ టికెట్‌లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పాఠ్యాంశాలను క్షుణ్ణంగా చదివి ఏదైనా సందేహాలుంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. ఒత్తిడిని జయిస్తే సగం వరకు పరీక్షలు పాసైనట్లేనన్నారు. టెన్త్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు పేరు తీసుకురావాలని కోరారు.

ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి

కుత్బుల్లాపూర్: వెంకటేశ్వరనగర్ సత్‌జ్ఞాన్ స్కూల్‌లో శుక్రవారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జీడిమెట్ల సీఐ పవన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చిన్నతనం నుంచి విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. ఒత్తిడి లేకుండా పరీక్షలు రాసి పాఠశాలు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఉపాధ్యాయులు చెప్పిన సబ్జెక్ట్స్‌లో ఉన్న అంశాల్ని మరొక్కసారి రివైజ్ చేసుకుని ప్రశాంత వాతావరణంలో ఎగ్జామ్స్ రాయాలని కోరారు. పాఠశాల కరస్పాండ్ చింతల మల్లేశం మాట్లాడుతూ 13 సంవత్సరాలుగా పాఠశాలలో నేర్చుకున్న క్రమశిక్షణ మంచి అలవాట్లు ఎప్పటికీ మరువరాదని కోరారు. నేతాజీ హైస్కూల్ కరస్పాండెంట్ చింతల మహేష్‌కుమార్ మాట్లాడుతూ.. 28 సంవత్సరాలుగా సత్‌జ్ఞాన్ హైస్కూల్ మంచి రిజల్ట్స్ సాధిస్తూ ఎంతోమంది విద్యార్థులని తీర్చిదిద్ది సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకుందన్నారు.

ఇద్దరు బాలలపై కుక్కల దాడి



సుభాష్‌నగర్: కిరాణా కొట్టుకు వెళ్తున్న బాలికపై వీధి కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరచిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గాజులరామారం డివిజన్ మల్లారెడ్డినగర్ లోని చెన్నకేశవనగర్‌కు చెందిన శ్రీధర్ రెడ్డి కుమార్తె అన్విత (8). గురువారం సాయంత్రం ఇంటి వద్ద ఉన్న కిరాణా కొట్టులో పాల ప్యాకెట్ కోసం వెళ్తుండగా అక్కడే ఉన్న వీధి కుక్క ఒక్కసారిగా దాడి చేసి గాయపరిచింది. దీంతో అన్వితను షాపూర్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి చేర్పించారు.

సూరారంలో...

సుభాష్ నగర్ డివిజన్ సూరారం కాలనీలోని ఇంటి పెంపుడు కుక్క దాడి చేసి ఓ వ్యక్తిని గాయపరిచింది. సూరారం కాలనీకి చెందిన ప్రేమ్ (15) ఇంట్లో పని చేస్తుండగా ఉదయం పెంపుడు కుక్క ఒక్కసారిగా అరుస్తూ కరిచింది.

మెకానిక్ షెడ్డులో అగ్ని ప్రమాదం

18 ద్విచక్రవాహనాలు దగ్ధం

జగద్గిరిగుట్ట: బైక్ మెకానిక్ షెడ్డులో జరిగిన అగ్ని ప్రమాదంతో 18 ద్విచక్ర వాహనాలు దగ్ధమైన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్టలోని రిక్షాపుల్లరి కాలనీలో కొన్నేళ్లుగా వరికుప్పల వాసు అనే వ్యక్తి కేబీఎస్ మెకానిక్ షెడ్డును నడుపుతున్నాడు. వాసుతో పాటు మెకానిక్‌గా బాబు కూడా పని చేస్తున్నాడు. కాగా శుక్రవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే స్థానికులు ఫైర్ సిబ్బందికి, పోలీసులకి సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలు అదుపులోకి తెచ్చారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని యజమాని వాసు చెప్పడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నెరవేరిన కల

అద్దె నుంచి సొంత భవనంలోకి తహసీల్దార్ కార్యాలయం

◆ గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్‌లో నిర్మాణం ◆ సొంత డబ్బు వెచ్చించిన బిల్డర్ యాదగిరిరెడ్డి



గాజులరామారంలో నూతనంగా నిర్మించిన కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయం

సుభాష్‌నగర్: ఎన్నో ఏళ్ల నుంచి అద్దె భవనంలో ఉంటున్న కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయానికి సొంత భవనం సమకూరింది. గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్ ప్రధాన రోడ్డు ఆనుకొని సర్వేనం.329/1లో 1500 గజాల స్థలాన్ని కేటాయించారు. 300 గజాల విస్తీర్ణంలో గాజులరామారానికి చెందిన బిల్డర్ యాదగిరిరెడ్డి తన సొంతంగా కోటి 10 లక్షల వ్యయంతో నూతన భవనాన్ని నిర్మించారు. ఈ భవనాన్ని గతనెల 24న మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, నవీన్‌రావు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద, కలెక్టర్ అమోయ్‌కుమార్ అధికారికంగా ప్రారంభించారు



గత నెల 24న నూతన తాహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి మల్లారెడ్డి



నూతన భవనం ఇన్ వార్డులో ఫిర్యాదులు స్వీకరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఇదీ చరిత్ర...

దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీరామారావు మొట్టమొదటగా మండల వ్యవస్థ 1986లో తీసుకువచ్చారు. ముందుగా కుత్బుల్లాపూర్ మండలం రెవెన్యూ కార్యాలయం షాపూర్‌నగర్‌లోని మూడు చోట్ల మార్చబడింది. అనంతరం సూరారంలో కొంతకాలం పాటు సేవలందించింది. అద్దె భవనాల్లో కొనసాగుతూ వస్తున్న తాహసీల్దార్ కార్యాలయానికి ఎట్టకేలకు గండి మైసమ్మలో సొంత భవనం ఏర్పాటు చేయగా కొన్ని ఏళ్ల పాటు సేవలందించింది. ప్రత్యేక రాష్ట్ర అంతరం కొత్త మండలాలు రాగా పెరిగిన జనాభా నేపథ్యంలో కుత్బుల్లాపూర్ మండలానికి అదనంగా బాచుపల్లి, దుండిగల్ రెండు మండలాలు మంజూరయ్యాయి. తదనంతరం జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉన్న కుత్బుల్లాపూర్ మండలాన్ని 2016లో సూరారంలోని వద్ద భవనానికి మార్చారు. దీంతో కథ మళ్లీ మొదటికే వచ్చింది.



ఇక ఇబ్బందులు తొలిగినట్టే..

కొన్నేళ్లుగా అద్దె భవనాలను కొనసాగిన తహసీల్దార్ కార్యాలయానికి సొంత భవనం రావడం శుభ సూచకం. సిబ్బందికి, కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఇక ఇబ్బంది తొలిగినట్టే. సిబ్బందితో సమన్వయంగా పనిచేసి ప్రజలకు సేవలను అందిస్తాం.

– సంజీవరావు, తహసీల్దార్ కుత్బుల్లాపూర్

కార్యాలయానికి పలుమార్లు తాళాలు...

సూరారంలో అద్దె భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం అద్దె సరిగా ఇవ్వక పోవడంతో యజమాని పలుమానులు కార్యాలయానికి తాళాలు వేశారు. అద్దె భారం పడడంతో రెండు అంతస్తులలో కొనసాగిన కార్యాలయం ఒక్క అంతస్తుకే సమకూర్చారు.

ఎట్టకేలకు సొంత భవనం..

గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్ లో ఎట్టకేలకు సొంత భవనం కల నెరవేరింది. ప్రధాన రోడ్డును ఆనుకొని ఉన్న సర్వే నంబర్ 329/1 సుమారు 1500 గజాల స్థలాన్ని పలుమార్లు కబ్జాకు యత్నించగా రెవెన్యూ అధికారులు కాపాడి వినియోగంలోకి తెచ్చారు. కోటి 10 లక్షల వ్యయంతో 300 గజాల విస్తీర్ణంలో ఈ భవనాన్ని నిర్మించారు. 9 విశాలమైన గదులు, పార్కింగ్, ఇతర సదుపాయాలు కల్పించారు.

గతంలో పనిచేసిన తహసీల్దార్లు...

ప్రత్యేక రాష్ట్ర అనంతరం 2016లో కొత్త మండలాలు ఏర్పడటంతో ఉమ్మడిగా ఉన్న కుత్బుల్లాపూర్ కేవలం జీహెచ్‌ఎంసీ పరిధికే పరిమితమైంది. అప్పటి నుంచి మొట్టమొదట తాహసీల్దార్‌గా ఇలియాజ్, అనంతరం సురేందర్, భూపాల్, గౌతమ్, గౌరీ వత్సల, మైపాల్ రెడ్డి, వినయ్ (ఇన్‌చార్జ్) కొనసాగారు. ప్రస్తుతం తాహసీల్దార్ సంజీవరావు కొనసాగుతున్నారు.

1992లో నక్సలైట్ల దాడి..

1992లో షాపూర్‌నగర్‌లోని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ ఇంటి వెనకాల అద్దె భవనంలో తహసీల్దార్ కార్యాలయం కొనసాగింది. నిత్యం ఎప్పటిలాగా ఎవరి విధుల్లో వాళ్లు నిమగ్నమయ్యారు. నలుగురు సాయుధ నక్సలైట్లు సైకిళ్లపై వచ్చారు. నేరుగా తహసీల్దార్ కార్యాలయంలోకి చొరబడి బాంబు విసిరారు. అది స్వల్పంగా పేలడంతో ప్రాణనష్టం జరగలేదు. కార్యాలయంలోని ఫర్నిచర్ ధ్వంసం కాగ, డాక్యుమెంట్లు చెల్లాచెదురయ్యాయి. మరో బాంబు విసరగా అదృష్టవశాత్తు అది పేలలేదు. ఆ సమయంలో అప్పటి ఎమ్మార్వో పాండురంగారావు లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. అనంతరం బాంబు స్క్వాడ్ రంగంలోకి దిగి పేలని బాంబును నిర్వీర్యం చేసింది. అప్పట్లో ఈ ఘటన రాష్ట్రంలో సంచలనం సృష్టించింది.

నాడు జూనియర్ అసిస్టెంట్, నేడు తహసీల్దార్

ప్రస్తుతం తహసీల్దార్ విధులు నిర్వర్తిస్తున్న సంజీవరావు 1992లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించారు. అనంతరం బదిలీలు ప్రమోషన్ల ద్వారా గతంలో తాను పనిచేసిన కుత్బుల్లాపూర్ మండలానికి తాహసీల్దారుగా వచ్చారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన ప్రభుత్వ విప్ శంభీపూర్‌రాజు

దుండిగల్: సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా పని చేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన సానుకూలంగా స్పందిస్తు ఆయా శాఖల అధికారులకు ఫోన్లు చేసి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

◆ హిందూ వాహిని కుత్బుల్లాపూర్ బాగ్ ప్రతినిధులు కలిసి ఏప్రిల్ 6వ తేదీన జగద్గిరిగుట్ట సలాసర్ హనుమాన్ శోభయాత్రకు హాజరుకావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు.

◆ మల్లంపేట్‌కు చెందిన ముస్లింలు కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు.



◆ ఎమ్మెల్సీ కవితను ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావుతో మర్యాద పూర్వకంగా కలిశారు.

దుండిగల్‌లో మెరుగైన పాలన అందించేందుకు కృషి

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని చైర్‌పర్సన్ సుంకరి కృష్ణవేణి అన్నారు. శుక్రవారం దుండిగల్ మున్సిపాలిటీ 2023–24 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను కృష్ణవేణి ప్రవేశపెట్టి ఆమోదింపజేశారు. 2023–24 సంవత్సరం మొత్తం పన్నులు, ఇతర వాటి నుంచి వచ్చే అంచనా ఆదాయంపై గ్రాంట్లు రూ.67.43 కోట్లు, 2023–24 సంవత్సరం అంచనా వ్యయంపై గ్రాంట్లు రూ.65.99 కోట్లు, 2023–24 మిగులు బడ్జెట్ అంచనా రూ. 1.44 కోట్లుగా నిర్ణయించారు. అనంతరం కౌన్సిల్ సభ్యులు అడిగిన ప్రశ్నలకు చైర్‌పర్సన్ సమాధానం చెప్పారు. మున్సిపాలిటీ అభివృద్ధి సహకరించి ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సత్యనారాయణ రావు, వైస్ చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్లు అరుణ, గోపాల్‌రెడ్డి, బొంగునూరి రమాదేవి, రాముగౌడ్, నవిత, సుజాత, నవనీత, సత్యనారాయణ, బాలామణి, విష్ణువర్ధన్‌రెడ్డి, సునీత తదితరులు పాల్గొన్నారు.



బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన దుండిగల్ చైర్‌పర్సన్ సుంకరి కృష్ణవేణి

సుపరిపాలన అందించే దిశగా పని చేస్తున్నాం

రంగారెడ్డినగర్: ప్రజలకు సుపరిపాలన అందించే దిశగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ప్రగతియాత్రలో భాగంగా శుక్రవారం ఆయన రంగారెడ్డినగర్ డివిజన్‌లో కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్‌తో కలిసి పర్యటించారు. నందానగర్, గాంధీనగర్, వెంకటరామ్‌రెడ్డినగర్‌లలో తిరుగుతూ స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నందానగర్‌లో రూ.2.90 కోట్లతో సీసీ రోడ్లు, ఎస్సీ స్మశాన వాటిక, బస్తీ దవాఖానా పనులు, అదే విధంగా గాంధీనగర్‌లో రూ.2.90 కోట్లతో భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్లు, వెంకట్రామిరెడ్డినగర్‌లో రూ.3 కోట్లతో కమ్యూనిటీ హాలు, భూగర్భ డ్రైనేజీ లైన్‌లు పూర్తి చేసినందుకు ఎమ్మెల్యేకు స్థానికులు కృతజ్ఞతలు తెలియజేశారు. హిందూ, ఎస్సీ, ముస్లిం శ్మశానవాటికలను అభివృద్ధి పరచడంతో స్థానికంగా బస్‌షెల్టర్‌ను ఏర్పాటు చేయాలని డివిజన్ ప్రజలు కోరారు. బస్‌షెల్టర్ ఏర్పాటుపై దృష్టి పెట్టాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జయరామ్, డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ఏర్వ శంకరయ్య, డీఈఈ భాను చందర్, ఏఈ మల్లారెడ్డి, కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



రంగారెడ్డినగర్ డివిజన్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్

కబ్జా చెరలో ప్రభుత్వ స్థలాలు

- నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్
- పరిరక్షించడంలో అధికారులు విఫలం

నిజాంపేట్: నిజాంపేట్‌లోని ఇందిరమ్మ కాలనీలో ప్రభుత్వ స్థలాలు కబ్జా చెరలో చిక్కుకుంటున్నా అధికారులు వాటిని పరిరక్షించేందుకు తీసుకుంటున్న చర్యలు శూన్యమని నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ అన్నారు. ఇందిరమ్మ కాలనీలోని సర్వే నంబరు 233/15లోని ఇందిరమ్మ కాలనీలో 300 గజాల స్థలం, అదే విధంగా బ్లాక్ నంబరు 23లో 800 గజాల స్థలం కబ్జాల విషయమై శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు.

◆ ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ.. కబ్జాల విషయమై మున్సిపల్, రెవెన్యూ హౌసింగ్ బోర్డు అధికారులు ఫిర్యాదు చేసినా విధమైన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాలను పరిరక్షించి వాటిని ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధి పరచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ మోర్చా జాయింట్ కన్వీనర్ దాసి నాగరాజు, జిల్లా ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు రంపం కాశి, కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శి భిక్షపతి యాదవ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు ప్రసాద్ రాజు, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు అశోక్ నాయక్, బీజేవైఎం ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోంది

టీపీసీసీ ఉపాధ్యక్షుడు డా. మల్లు రవి

కుత్బుల్లాపూర్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థను అపహాస్యం చేస్తోందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ మల్లు రవి అన్నారు. రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేసిన నేపథ్యంలో శుక్రవారం మేడ్చల్ జిల్లా నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. దేశాన్ని లలిత్ మోడీ, నీరవ్ మోడీ, ఆదానీలు దోచుకుంటున్నారని అన్నారు. వారికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కాపలా కాస్తున్నాడని అన్నారు. ఈ విషయమై ప్రశ్నించినందుకే రాహుల్‌గాంధీపై వేధింపులు మొదలు పెట్టి, తప్పుడు కేసులు పెట్టి పార్లమెంటు సభ్యత్వం రద్దు అయ్యేలాగా ఆగ మేఘాలపై నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపించారు.

◆ ఈ దేశానికి సేవ చేసిన, ప్రాణ త్యాగాలు చేసిన గాంధీ కుటుంబంపై వ్యక్తిగత ద్వేషం పెంచుకున్నారని ఆరోపించారు. వారుంటున్న క్వార్టర్ నుంచి కూడా ఖాళీ చేయాలని హుకూంలు జారీ చేస్తున్నారని విమర్శించారు. ప్రజలు, మేధావులు ఇవన్నీ గమనిస్తున్నారని అన్నారు. ఈ బీజేపీ ప్రభుత్వానికి మోదీ, అమిత్‌షాలకు బుద్ధి చెప్పే రోజు దగ్గరలోనే ఉందన్నారు.

◆ ఈ సమావేశంలో టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి, జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్, ఉప్పల్ నియోజకవర్గ ఏ, బీ బ్లాక్‌ల అధ్యక్షులు మందుమల్ల పరమేశ్వర్‌రెడ్డి, సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, టీపీసీసీ జనరల్ సెక్రటరీ చరణ్ కౌశిక్‌యాదవ్, జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు చంద్రశేఖర్, నాయకులు సంజీవరెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మల్లు రవి

పేపర్ లీక్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

కుత్బుల్లాపూర్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి నిరుద్యోగులకు న్యాయం జరిగేలా చూడాలని ఏబీవీపీ మేడ్చల్ జిల్లా కన్వీనర్ నగేష్ అన్నారు. శుక్రవారం కొంపల్లి నగర శాఖ ఆధ్వర్యంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ... టీఎస్‌పీఎస్సీ పేపరు లీకేజీతో 32 లక్షల మంది నిరుద్యోగులకు అన్యాయం జరిగిందన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయడంతో పాటు చైర్మన్‌ను తొలగించాలన్నారు. సూత్రధారులకు సహకరించి ప్రభుత్వ పెద్దలపై కేసులు నమోదు చేయాలన్నారు. పేపరు లీకైన నోటిఫికేషన్లను మొత్తం రద్దు చేసి తిరిగి పరీక్షలు నిర్వహించాలని కోరారు. ఈ నిరసనలో గౌతమ్, అఖిల్, సాయి, శృతి, మేఘన, స్వాతి తదితరులు పాల్గొన్నారు.



కొంపల్లి నగర శాఖ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న ఏబీవీపీ కార్యకర్తలు

చిరుధాన్యాలతో విలువైన పోషకాలు లభిస్తాయి

కుత్బుల్లాపూర్: చిరుధాన్యాలతో పిల్లలకు, గర్భిణులకు విలువైన పోషకాలు లభిస్తాయని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భాగ్యమ్మ అన్నారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ సెక్టర్ లోని వాజ్‌పేయినగర్‌లో అంగన్‌వాడీ కేంద్రంలో చిరుధాన్యాల వల్ల కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. ఈ సంర్భంగా చిరుధాన్యాలతో తయారు చేసుకునే వంటకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రమణ ,భవాని, శ్రీలక్ష్మి, సంతోషి, చంద్రకళ, సురేఖ, కుత్బుల్లాపూర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్ ప్రారంభించారు.

కొంపల్లిని అభివృద్ధికి కేరాఫ్‌గా తీర్చిదిద్దుతాం

కుత్బుల్లాపూర్: కొంపల్లిని అభివృద్ధికి కేరాఫ్‌గా తీర్చిదిద్దనున్నామని కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ అన్నారు. 2023–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్‌ను శుక్రవారం కొంపల్లి మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన ప్రవేశపెట్టి ఆమోదింపజేశారు. మున్సిపల్ ప్రారంభ ఆదాయ నిల్వ రూ.96.58 లక్షలు ఉండగా 2023–24 సంవత్సరానికి అంచనా ఆదాయాన్ని గ్రాంట్స్‌తో కలుపుకుని రూ.2356.33 లక్షలుగా నిర్ణయించారు. అందులో మున్సిపల్ ఉద్యోగుల వేతనాలకు రూ.590 లక్షలు, శానిటేషన్ నిర్వహణకు రూ.200 లక్షలు, పవర్ చార్జీలకు రూ.131 లక్షలు కేటాయించారు.

◆ 1. పారంభపు నిలువ రూ. 96.58లక్షలు

◆ 2. (2023–2024)కు అంచనా ఆధాయం (గాంట్స్ కలుపుకొని) రూ.2259.75 లక్షలు, మొత్తం అంచనా ఆదాయం రూ. 2356.33లక్షలు.

◆ వివిధ వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.329లక్షలు, డిపాజిట్లకు రూ.95 లక్షలు, క్యాపిటల్ గ్రాంట్స్ అంచనా వ్యయంగా రూ.365 లక్షలు నిర్ణయించారు. మొత్తం అంచనా వ్యయం రూ.2359.05 లక్షలు. అదే విధంగా మిగులు రూ.77.28 లక్షలుగా నిర్ధారించారు. అనంతరం శ్రీశైలంయాదవ్ మాట్లాడుతూ.. అన్ని వార్డుల్లో అభివృద్ధే ధ్యేయంగా బడ్జెట్‌ను రూపకల్పన చేశామన్నారు. అన్ని వర్గాల ప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని బడ్జెట్‌ను ఆమోదించామన్నారు. ఈ సమావేశంలో వైస్‌చైర్మన్ రత్లావత్ గంగయ్య నాయక్, ఇంజినీర్ చిరంజీవులు, మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్, జూనియర్ అకౌంటెంట్ ప్రణతి, జూనియర్ అసిస్టెంట్ రంజిత, వార్డు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్

ఏ వస్తువు కొనుగోలు చేసిన రసీదు తీసుకోవాలి

వినియోగదారుల హక్కులపై అవగాహన

నిజాంపేట్: ఏ వస్తువు కొనుగోలు చేసినా రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని మల్కాజ్‌గిరి జిల్లా పౌర సరఫరా నిఘా కమిటీ సభ్యుడు, జిల్లా వినియోగదారుల సమాచారం కేంద్రం బాధ్యులు చికిలే మధుబాబు అన్నారు. శుక్రవారం బేగంపేట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ... వినియోగదారులు ఏదైనా వస్తువు కొనుగోలు చేస్తే దాని పూర్తి వివరాలు తెలుసుకోవాలన్నారు. ఆ వస్తువు ఎప్పుడు తయారు చేశారో.? ఎప్పటి వరకు పని చేస్తుందో.? అనే వివరాలు చూసిన తరువాతనే కొనుగోలు చేయాలి సూచించారు. జాగో గ్రాహక్ జాగో అనే నినాదాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. బాధ్యతాయుతమైన పౌరులుగా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇతరులకు సైతం వస్తువుల కొనుగోళ్లపై చైతన్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అధిపతి ఇలియట్, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 2, ప్రోగ్రాం ఆఫీసర్ ఉమామహేశ్వరి, సరిత, విద్యార్థులు పాల్గొన్నారు.

టోల్ చార్జీలు పెంపు నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలి

కుత్బుల్లాపూర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెంచిన టోల్ పన్నును వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ రాష్ట్ర క్యాదర్శి పుప్పాల శ్రీకాంత్, రాష్ట్ర నాయకుడు కీలుకాని లక్ష్మణ్ అన్నారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి టోల్ పన్ను పెరుగనున్న నేపథ్యంలో దానికి నిరసనగా శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతంలో ఉషోదయ టవర్స్ నుంచి జీడిమెట్ల సబ్ స్టేషన్ వరకు వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం షాపూర్‌నగర్ హనుమాన్ గుడి వద్ద ఉన్న డీసీఎం అడ్డా వద్ద నిరసన తెలియజేశారు.

– ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రహదారుల అభివృద్ధి సెస్ పేరుతో ప్రతి లీటర్ పెట్రోల్ పైన రూ.5లు, ప్రతి లీటరు డీజిల్ పైన రూ.2లు అదనంగా వసూలు చేస్తున్నారని అన్నారు. 2017–18 బడ్జెట్ కాలం నుంచి మోదీ ప్రభుత్వం దీనిని ×రోడ్డు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సెస్‌‌గా మార్చేసిందన్నారు. ఈ మొత్తాన్ని రోడ్డు నిర్మాణానికి దాని నిర్వహణకు ఉపయోగించాలి.. కాని పెట్రోలియం ప్రణాళిక, విశ్లేషణ శాఖ లెక్కల ప్రకారం 2021–22 ఆర్థిక సంవత్సరంలో 30849000 మెట్రిక్ టన్నుల పెట్రోలు, 76659000 మెట్రిక్ టన్నుల డీజిల్ అమ్ముడుపోయిందన్నారు.

◆ దానిపై ప్రభుత్వం రోడ్డు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సెస్ కింద రూ.2,70,000 కోట్లను వసూలు చేసిందని పేర్కొన్నారు. మౌలిక వసతుల అభివృద్ధి సెస్ వసూలు చేసిన తరువాత తిరిగి టోల్ పన్నును వసూలు చేయడం ఏ విధంగా న్యాయమవుతుందని ప్రశ్నించారు. ప్రభుత్వం టోల్ రేట్ నిర్ణయించే ముందు నోటీసు ఇచ్చి ప్రజల అభిప్రాయాలను కూడా పరిగణలోకి తీసుకోవాలన్నారు. కానీ అవేమీ చేయకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అజయ్ బాబు, నాయకులు బీరప్ప, ఉమేష్‌రెడ్డి, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.



టోల్ చార్జీలు పెంపుదలపై నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు